క్లుప్తంగా

నేడు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

టేకుమట్ల : మండలంలోని రాఘవాపూర్‌లో శ్రీ వేంకటేశ్వర సేల్స్ కార్ప్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మేనేజర్ చల్లా జితేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం నిత్యనిధి ఆరాధన, హోమం అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను సర్పంచ్ నందికొండ శోభామహిపాల్‌రెడ్డి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత?

మల్హర్: మండలంలోని వల్లెకుంటలో రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్న ఓ వ్యక్తిని, ట్రాలీని కొయ్యూరు పోలీసులు సోమవారం పట్టుకున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. మండలంలో దేవరాంపల్లికి చెందిన వ్యక్తి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా 6 నుంచి 8 క్వింటాళ్ల బియ్యంతో పోలీసులకు చిక్కినట్లు గ్రామంలో సమాచారం. ట్రాలీని, సదరు వ్యక్తిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. దీనిపై ఎస్సై నరేష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

నిబంధనలకు విరుద్ధంగా కాల్వ నిర్మాణం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 12వ వార్డులో సైడ్ కాల్వను నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ నిర్మిస్తున్నారని రాజేశ్వర్‌రావు, రఘు, రమేష్, రాజేశ్వర్‌రావు, హుస్సేన్‌లు సోమవారం తెలిపారు. 50 ఫీట్లకు అవతల కాల్వ నిర్మించాల్సి ఉండగా 43 ఫీట్లతోనే నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో రోడ్డు అతిదగ్గర కాల్వ ఉందన్నారు. నిబంధనల ప్రకారం 50 ఫీట్ల తర్వాత కాల్వ ఉండాలని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

ఎస్ఎస్‌తాడ్వాయి: అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దని తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు గొత్తికోయలకు సూచించారు. సోమవారం మండలంలోని కాల్వపల్లి సమీపంలోని గొత్తికోయగూడెంలో కమ్యూనిటి కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గూడెంలో ఎంత మంది నివసిస్తున్నారని ఆరా తీశారు. ఎవరైనా గూడెంలోకి కొత్త వ్యక్తులు వచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టుల సంచారంపై పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

ప్రారంభమైన డ్రైమిక్స్ యూనిట్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని స్వయంకృషి పేరుతో నిర్మించబడిన డ్రైమిక్స్ యూనిట్ కొద్దికాలంగా మూసివేసి ఉంది. ఇటీవల ఐటీడీఏ పీఓ అంకిత్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ పోచం ద్వారా ఉత్పత్తులను మళ్లీ డ్రైమిక్స్ యూ నిట్ సభ్యులు మొదలుపెట్టారు. గిరిజన ఆశ్రమ పాఠశాల పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు డ్రైమిక్స్ యూనిట్ స్వయంకృషి జాయింట్ లైబిలిటీ గ్రూప్ సభ్యుల ద్వారా జొవార్ మిల్ తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన జోహార్ మిల్ జీసీసీ ద్వారా వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసేందుకు రూపకల్పన చేశారు. ఈ గ్రూపు ద్వారా ఇప్పటి వరకు 1600 కిలోల జోహార్ మిల్ తయారు చేసినట్లు జేడీఎం కొండల్‌రావు తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్లకు న్యూట్రిషనల్ ఫుడ్ సరఫరా చేయుటకు స్వీట్ మిల్ ఇండెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


తిరుపతి (ఫైల్)

భూపాలపల్లి రూరల్: మానసిక స్థితి సరిగా లేక యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని గోర్లవీడులో చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాపాక శంకర్‌-సాంబలక్ష్మి దంపతుల కుమారుడు తిరుపతి (18) హైద్రాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. మానసిక స్థితి సరిగాలేక గతంలో రెండు, మూడు సార్లు ఆత్మహత్యకు యత్నించాడని తెలిపారు. నెల కిందట పరీక్షలు ఉండగా హైదరాబాద్‌లోని కళాశాలకు వెళ్లాడు.ఈనెల 2న ఇంటికి వచ్చే క్రమంలో గణపురం మండలంలోని చెల్పూరు జెన్‌కో క్రాస్‌వద్ద పురుగుల మందు తాగుతున్నానని కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌ద్వారా తెలిపాడు. కుటుంబ సభ్యులు వచ్చే వరకు తిరుపతి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హన్మకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రహదారిపై పశువుల సంచారం

వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్న మూగజీవాలు

● పట్టించుకోని జీపీ సిబ్బంది, పశుపోషకులు

కాటారం: పశుపోషకులు, గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. పశువులను తమ యజమానులు ఇష్టానుసారంగా వదిలేయడంతో పాటు జీపీ సిబ్బంది రహదారులపై సంచరించకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అవి మృత్యువాత పడుతున్నాయి. మండల కేంద్రం మీదుగా భూపాలపల్లి వైపు వెళ్లే 353(సి) జాతీయ రహదారితో పాటు మంథని, మహదేవపూర్ వైపు ప్రధాన రహదారుల వెంట నిత్యం పదులసంఖ్యలో పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రాత్రివేళ ప్రధాన రహదారిపై వీటి సంచారం మరింత ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో రోడ్లపైనే పడుకోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. భూపాలపల్లి, మంథని, మహదేవపూర్ వైపుగా నిత్యం వందలాది బొగ్గు, ఇసుక లారీలు నడుస్తుండటంతో వాహనదారులు వాటిని ఢీ కొట్టడంతో ఇటు వాహనదారులకు ప్రమాదం నెలకొనడంతో పాటు పశువులు మృతి చెందుతున్న పరిస్థితి నెలకొంటుంది. పశువులు ప్రమాదాల్లో మృతి చెందుతున్నప్పటికీ యజమానుల్లో మార్పు రావడం లేదు.


ప్రధాన రహదారిపై సంచరిస్తున్న పశువులు

అధికారులు చర్యలు చేపట్టాలి

ప్రధాన రహదారులపై పశువులు సంచరించకుండా గ్రామపంచాయతీ అధికారులు, పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పశువులు నిత్యం రోడ్లపైనే ఉండటంతో రహదారులు అపరిశుభ్రంగా మారిపోవడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పశువులు రోడ్లపైకి వస్తే జరిమానా విధిస్తామని జీపీ అధికారులు గతంలో ప్రకటించగా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. రోడ్లపైకి వచ్చే పశువులను గుర్తించి వాటి యజమానులకు జరిమానా విధిస్తే పశువుల సంచారం తక్కువ అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు, పాలకవర్గం స్పందించి రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దుబ్బపల్లి ఎస్‌బీఐ ఎదుట నిరసన


ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గణపురం: ప్రధాని మోదీ తన సన్నిహితుడు అదాని గ్రూపుల్లో ప్రభుత్వ రంగ సంస్థలైన ఎస్‌బీఐ, ఎల్ఐసీ సంస్థల్లో నిరుపేదలు దాచుకున్న డబ్బును భారీగా షేర్ల రూపంలో పెట్టుబడి పెట్టించడంతో ఆ సంస్థలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంపటి భువనసుందర్ అన్నారు. సోమవారం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దుబ్బపల్లి ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గౌతమ్ అధాని మోదీకి ఉన్న సాన్నిహిత్యంతో ఎస్‌బీఐ, ఎల్ఐసీల నుంచి షేర్ల రూపంలో పెట్టుబడులు పెట్టించారన్నారు. అదాని -హీడెన్‌బర్గ్ గొడవల్లో ప్రపంచ అపరకుబేరులు నేలమట్టం కావడంతో అదానీ గ్రూప్ తీవ్రంగా నష్టాలను చవిచూసిందన్నారు. కాంగ్రెస్ జాయింట్ పార్లమెంటరీ కమిషన్ లేదా సీజేఐ నేతృత్వంలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ప్రధానకార్యదర్శి అప్పాల శ్రీని వాస్, గాంధీనగర్ గ్రామకమిటి అధ్యక్షుడు పోతురాజు సురేష్, నాయకులు జెట్టి కనుకరాజు, దూడపాక పున్నం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

పలిమెల : మండలంలోని పంకెన గ్రామానికి చెందిన 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు సోమవారం ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నన్న, నాయకులు రాజబాబు, రాజేందర్, జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో పట్టు సాధించాలి


అవగాహన కల్పిస్తున్న అన్వేష్

మహదేవపూర్: స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పుట్ట లింగమ్మ ట్రస్ట్ సౌజన్యంలో ఇన్‌స్పైర్‌-ఇగ్నైట్ సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులను వ్యక్తిత్వ వికాస నిపుణుడు అన్వేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులు 10 గ్రేడ్ పాయింట్లు సాధించడం ఎలా?, ప్రణాళిక బద్ధంగా చదవడం ఎలా? విద్యార్థి చదువులో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలు బాగా రాయాలంటే ప్రాక్టీస్ చేస్తూ చదివితే 10 గ్రేడ్ పాయింట్లు సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు శవణ్ అన్నారు. ధ్యానంతో చదువుపై ఏకాగ్రత పెంచుకోవచ్చని, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు. పరీక్షలు అంటే భయం వదిలిపెట్టాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో ముందుండాలనేదే మా ప్రయత్నం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో శ్రీపతిబాపు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం పనులు ప్రారంభం

మహాముత్తారం: మండలంలోని మహబూబ్‌పల్లి గ్రామంలో సోమవారం క్రీడా ప్రాంగణం నిర్మాణ పనుల ఎంపీడీఓ ఏలేశ్వరం రవీంద్రనాథ్ కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు


మహిళా క్రీడాకారులతో టీఎన్జీఓస్ నాయకులు

ములుగు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీఓస్ ములుగు శాఖ తరఫున శనివారం, సోమవారం నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్ అన్నారు. మహిళా దినోత్సవం రోజు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోలు రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు చైతన్య, కార్యదర్శి మేఘన, ఉపాధ్యక్షుడు మహేందర్, అంగన్వాడీ టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షురాలు ఎనగందుల సునీత, సరిత, వర్ష, జసింత, శ్రీవాణీ, సౌమ్యరెడ్డి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌లో మహిళా దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భూపాలపల్లి రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భూపాలపల్లి బస్‌స్టేషన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడల అధికారి సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులతో పాటు బస్టాండ్‌లో జౌట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మిప్రసన్న, ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయంపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాధికారిగా అక్షిత్, ప్రధానోపాధ్యాయులుగా అజయ్, పీఈటీ విఘ్నేష్, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించి ప్రతిభను కనబర్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్రె ప్రవీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి


మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి

టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ముందుగా సమస్యలను గుర్తించి వారి పరిష్కార మార్గాలను అన్వేషిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అలాగే అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు విధులపై నిర్లక్ష్యం వహించరాదని అన్నారు.

హాజరు కాని అధికారులు, ప్రజాప్రతినిధులు.

మండల కేంద్రంలో ఎంపీపీ మల్లారెడ్డి ఆధర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో సభ సాధారణంగా కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, తహసీల్దార్, ఎంపీఓ సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్


వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ములుగు రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని అసిస్టెంట్ లేబర్ ఆధికారి వినోదకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కార్డులు కలిగి ఉన్న కార్మికుల కార్డుల్లో తప్పుల సవరణకు అధికారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డు కలిగిన కార్మికులు ఇన్సూరెన్స్ దరఖాస్తులు చేసుకోవడం తెలియక నష్టపోతున్నారని అన్నారు. రెండు జిల్లాలకు ఒకే కార్యాలయం కావడంతో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరుగుతుందన్నారు. భూపాలపల్లికి లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావద్దు


మాట్లాడుతున్న గెస్ట్ స్పీకర్ సదానందం

భూపాలపల్లి అర్బన్: పదో తరగతి విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ధైర్యంతో ముందుకు వెళ్లి పరీక్షకు హాజరు కావాలని గెస్ట్ స్పీకర్ సదానందం బాపూజీ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సన్ వ్యాలీ హైస్కూల్లో సోమవారం పది విద్యార్థులకు మానసిక నైపుణ్య తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలపై భయాందోళన తొలగించాలని నేపథ్యంలో యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

గీత కార్మికుడి కుటుంబానికి చెక్కు అందజేత


బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

చిట్యాల: తాటిచెట్టుపై నుంచి పడి గాయాలైన మండలంలోని చల్లగరిగెకు కి చెందిన గీత కార్మికుడు పోశాల భద్రయ్య కుటుంబానికి మంజూరైన రూ.15వేల విలువ గల చెక్కును బాధిత కుటుంబానికి సోమవారం సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీపతి గోపిగౌడ్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అసిస్టెంట్ అధికారి క్రాంతికిరణ్‌లు అందించారు. హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం తాడి కార్పొరేషన్ నుంచి ప్రభుత్వ సహాయం క్రింద రూ.15వేలు మంజూరైనట్లు తెలిపారు. భద్రయ్య పరిస్థితిని బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి, తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి ఈ సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి గడ్డం సదానందం గౌడ్, గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు ఏరుకొండ తిరుపతి గౌడ్, సర్పంచ్‌లు కర్రె మంజుల అశోక్ రెడ్డి, నందికొండ కవిత రవీందర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కనుకుల ప్రభాకర్, సంఘం నాయకులు సాయిలు, రమేష్, సుధాకర్, ఐలయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు


రేగొండ వాణి విద్యానికేతన్‌లో చిన్నారులు..

టేకుమట్ల(రేగొండ): రంగుల హరివిల్లు విచ్చుకునే రోజు హోలీ పండుగ. హోలీ సందర్భంగా సోమవారం రేగొండ మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్, రామన్నగూడెంతండా ప్రాథమిక పాఠశాలలో హోలీ సంబురాలు ముందస్తుగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాజర్ల తిరుపతిగౌడ్, కామిడి సతీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రజినీకుమార్, రాజు, రవీందర్, భిక్షపతి, దేవేందర్, మధు, సంధ్యా, చైతన్య, ఉజ్వల, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య పర్యావరణాన్ని సృష్టించాలి


ప్రకృతిపరమైన రంగులను తయారు చేసిన విద్యార్థినులు

మహదేవపూర్: హోలీ పండుగ సందర్భంగా ప్రకృతి సిద్ధమైన రసాయనాలు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని ఇకో క్లబ్ కమిటీ కన్వీనర్ రజిత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇకో క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ హోలీ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానం మాట్లాడుతూ.. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు టి.రజిత, కమిటీసభ్యురాలు అఫ్రోసుల్తానా సహకారంతో రంగుల తయారీలో వాడిన మందార బంతి, మొక్కజొన్నపిండి, గోధుమపిండి, అలోవెరా మైదాకు, మోదుగు, గులాబీ పూలు, బీట్రూట్, పసుపును గురించి విద్యార్థులు వివరించారు. ఇటీవల కెమికల్స్ కలిపిన రంగులను వాడడం వలన ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా శాశ్వతంగా చూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రమేష్, మున్నయ్య, విజయ్ కుమార్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజు, రాజేందర్, రమేష్,రవీందర్, మహేష్, వేణుగోపాల్, కరీంబీ, శివకృష్ణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుట్ట ట్రస్టు అండ


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న పద్మ


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న శ్రీనివాస్

మహదేవపూర్: మంథని నియోజకవర్గం వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ కాలేజీలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత మనోహర్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థుల ఆకలి తీర్చడమే ట్రస్టు లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం సంస్థ డైరెక్టర్ వెన్నంపల్లి మహేష్, మండల యూత్ అధ్యక్షులు ఆలింఖాన్, మాజీ మహిళ మండల అధ్యక్షురాలు అన్నమనేని అరుణ, సోషల్ మీడియా ఇంఛార్జి దబ్బెట రవీందర్, బొమ్మాపూర్ సర్పంచ్ ఒడెటి పద్మ, పట్టణ మహిళ అధ్యక్షురాలు చిలుక సునీత పాల్గొన్నారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం

కాటారం : పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్, ఐటీఐ కళాశాల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండ గొర్ల వెంకటస్వామి భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులు అర్ధాకలితో ఉండకూడదనే ఉద్దేశ్యంతో ట్రస్టు ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రజాసేవకుడు పుట్ట మధు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ వంగళ రాజేంద్రాచారి, నాయకులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామంలోని ప్రజలు వినియోగించుకోవాలని కొత్తపల్లి (ఎస్ఎం) సర్పంచ్ పెరుమాండ్ల రఘు అన్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింగం, వైద్యులు ఉమాదేవి, రోషిణి, సిహెచ్ఓ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.